దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనా రీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.

సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావసరళిని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఈతరం రచయిత రచించినదైనాగానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు.


ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

# ముహూర్తం

పి. చంద్రశేఖర అజాద్

ఆ ఇంటి ముందు చిన్నకారు ఆగి ఉంది. దాని వెనకాల మరో కారు, దాని వెనకాల ఓ ఆటో సైతం ఆగి ఉన్నాయి. కొంత మంది పనివాళ్ళు హడావుడిగా తిరుగుతున్నారు. వెనక కారు డిక్కీలోకి ఓ గ్యాస్ స్టవ్ ...దాంతో పాటు ఓ సిలెండర్ చేరాయి. ఓ హాట్‌కేసూ, దాంతోపాటు మరికొన్ని పాత్రలూ, ఇంకా బెడ్ షీట్లూ, మెత్తటి 'ఫోమ్' దిండ్లూ చేరిపోయాయి.

పొట్ట ఎత్తుగా కనిపిస్తున్న ఓ అమ్మాయిని అటూ ఇటూ ఇరువురు మహిళలు పట్టుకోగా నడిపించుకొచ్చారు. అతి సున్నితంగా కారులో కూర్చోబెట్టారు. బంగారు రంగు ఫ్రేమ్ కళ్ళద్దాలు తగిలించుకున్న ఓ నడి వయస్కురాలు ఆ అమ్మాయి పక్కన కూర్చుంది. వారిద్దరికీ హేండ్‌బాగ్‌లు అందించారు.






మరికొంతమంది వెనక కారులో, పనివాళ్ళు ఆటోలో స్థిరపడ్డాక అవి కదిలాయి. ముందుకారులో రేబాన్ కళ్ళజోడు తగి-




లించుకున్న ఓ యువకుడు కూర్చున్నాడు. అవన్నీ అలా నగరపురోడ్ల మీద మెత్తగా జారుకుంటూ ఓ విశాలమైన ఆవరణలో ఆగాయి.

అదో పెద్ద భవనపు సముదాయానికి చెందింది. చూట్టానికో విశ్వవిద్యాలయంలా ఉంది. శిఖరాగ్రాన ఆ సంస్థ పేరుంది. ఆ ఆవరణనిండా కార్లూ, ఆటోలూ, స్కూటర్లూ ఉన్నాయి. చాలా అరుదుగా మాత్రమే అక్కడ హాస్పటల్ వాసన వస్తూంది.

ఎటుచూసినా పాలరాయి . . . అద్దాల తలుపులు . . . వాటివెనుక చిరునవ్వుతో పని చేసుకుపోతున్న మనుషులు . . . కంప్యూటర్ల ముందు అందమైన చేతివ్రేళ్ళ కదలికలు . . . లోపల చూట్టూ ఫిక్స్ చేసిన విజిటర్స్ సీట్లు . . . గాలి అంతా అక్కడ కంట్రోల్ చేయబడింది. గాలి వాసన కూడా మధురంగా ఉంది.

కార్లు ఆగాయి. ఆ అమ్మాయిని నడిపించుకుంటూ వెళ్ళారు. వెనకాల సామానంతా చేరింది. పరుగుపరుగున వెళ్ళారు. పాలపాకెట్లు అక్కడికి ప్రవహించాయి ఓ గదంతా చిన్న వంటగదిలా చేశారు. మరో గదిలో ఆ అమ్మాయిని ఉంచారు.

అందమైన పింగాణి కప్పులు, సాసర్లు, ప్లేటులు, వాటితోపాటు ఇంకా రకరకాల పళ్ళు. . . స్వీట్స్. . .అదంతా హాస్పటల్ లాలేదు. పెళ్ళిచూపుల్లా ఉంది. శోభనం గదిలా ఉంది.

'రేబాన్' కళ్ళద్దాల యువకుడు నడివయస్కురాలితో మాట్లాడాడు.

"పంతులు గారికి వెంటనే కబురు చెయ్యి" అంది.

కార్లు పరిగెత్తాయి. మరో అరగంటలో పంతులుగారు పంచాగంతో ప్రవేశించారు.

> "పిల్లల్ని కనటానికి ఇంత రాక్షసమైన నొప్పులు అవసరమా . . . వుఫ్ హేట్ ఇట్ . . . నొప్పులు లేని ప్రసవాన్ని అన్వేషించాలి."
>
> ఆ పసిబిడ్డ మాత్రం ఏడుస్తూ ఉన్నాడు – తల్లిపాల కోసం అత్యంత సహజంగా ఉందా ఏడుపు
>
> మరా తల్లి పాలు ఇస్తుందో . . . ఇవ్వదో . . .

'కాఫీ' మాత్రమే తాగుతానన్నారు. అలానే తాగాక పంచాంగం ముందు వేసుకొని కూర్చున్నారు.

"నక్షత్రం చూడండి. మంచి నక్షత్రం కావాలి. ఘడియలు కూడా లెక్కకట్టి చెప్పండి. మేం మామూలుగా పంచాగం చూశాం. పిల్లలు మూడు అక్షరాల్లో నచ్చే మంచి పేర్లు నాలుగు సెలక్ట్ చేసుకున్నారు. ఏ నక్షత్రమయితే ఆ నక్షత్రం అన్నమాట. అంతేకాదు. మీరు దగ్గరుండి పనంతా అయ్యాక గాని వెళ్ళటానికి లేదు" అందామె.

"ఎంతమాట" అన్నాడు భక్తితో.

చాలాసేపు తంటాలు పడ్డాడు. లెక్కలు వేసుకున్నాడు. ఆ యువకుడ్ని పిలిచి అడిగాడు.

"అయ్యా తమరిది ఏ వాచ్"

"జపాన్‌ది. లేటెస్ట్ మోడల్. ఒలింపిక్స్‌లో ఉపయోగించే సాఫిస్టికేటెడ్ అంటే స్ప్లిట్ సెకండ్‌ని కూడా చెప్పగలదు."

"మంచిది. రేపు రాత్రికి దివ్యమైన ముహూర్తం ఉంది" అన్నాడు.

అతను నడివయస్కురాలి కేసి చూశాడు.

ఆమె అంగీకారంగా తలూపింది

లేడీ డాక్టరు ముందు ఆ ఇద్దరూ కూర్చున్నారు.

"నొప్పులు వచ్చేంత వరకూ ఆగదలుచుకోలేదు. ముందు మా అమ్మాయికి అంత నొప్పులు భరించే అవసరం లేదు. తనసలు భరించలేదు. అయినా ఎప్పుడు నొప్పులు వస్తాయో ఎవరు చెప్పగలరు. ఏ దుర్ముహూర్తంలోనో పుట్టారనుకోండి. వాళ్ళ బతుకులు ఎలా ఏడుస్తాయో. ఇంతింత అభివృద్ధి చెందాంకదా. మంచి ముహూర్తానికే పిల్లలకు జన్మనిద్దాం."

"బట్. . . . నొప్పులు సహజం. పెయిన్‌లేందే సృష్టి ఎలాసాధ్యం."

అతను కుర్చీలో అసహనంగా కదిలాడు.

"పెయిన్‌తోనే జననం జరుగుతుంది. డాక్టర్ మీరు ఆలోచించాల్సింది పేషెంట్ సౌలభ్యం. దాంతోపాటు. . . " అని ఆగింది.

"ఇట్సాల్ రైట్" అందావిడ

వారిద్దరూ లేచారు.

* * *

"పంతులుగారు" ఆధునిక వాచ్‌ని తదేకంగా చూస్తున్నారు.

అది ఆపరేషన్ థియేటర్. 'లాబర్ రూం' అత్యంత ఆధునికంగా ఉంది.

ఆ యువతి ఈ ప్రపంచాన్ని మరిచి నిద్రపోతూంది. డాక్టర్‌కు ఎంత మనసులోకి రానీయకూడదనుకున్నా ఆ 'చెక్' ఎమౌంట్ గుర్తుకొస్తోంది.

"పిల్లల్ని కనటానికి ఇంత రాక్షసమైన నొప్పులు అవసరమా . . . వుఫ్, హేట్

ఇట్ . . . నొప్పులు లేని ప్రసవాన్ని అన్వేషించాలి."

ఎవరో అరుస్తున్నారు.

సైన్స్ చాలా ముందుకు వెళ్తుంది. . .

'ఆపరేషన్ మేడీజీ' అయింది.

బహుశా నొప్పులు కంటే ఇదే నయమా? ఏమో! తమకు కావలసింది రోగాలు. . . రోగులు. . . డబ్బులు... డ... బ్బు... లు.

"అమ్మా. . . ఇదిగో. . . ఇక్కడకు ముల్లు చేరుకున్న ఘడియకి ఆరంభించండి" అన్నాడు 'పంతులుగారు.'

గడియారంలో ముళ్ళు కదులుతున్నాయి.

సరిగ్గా ఆ గొప్ప ముహూర్తాన్నే ఆ అమ్మాయి పొట్టని కత్తి చీల్చింది. ఆ అమ్మాయికి ఏం జరిగిందో తెలియదు. నెప్పులు తెలియవు. బాధ తెలియదు. ఓ బిడ్డకు 'శాస్త్రీయంగా' జన్మనిచ్చారు.

ఎప్పటికో ఆమెకు మెలకువ వచ్చింది.

ఎదురుగా బిడ్డను చూపించారు.

అదేరోజు షాంపయిన్ సీసాలు ఓపెన్ అయ్యాయి. అందరి కళ్ళలో సంతోషం. . . డాక్టర్‌కి ఆనందం. నర్సులకి కానుకలు. . . టెలిగ్రాంలు. . . అభినందనలు. . .

పంతులుగారు ఇంటిదగ్గర అన్నారు.

"సైన్స్ చాలా ముందుకు వెళ్తూనే ఉంది. నాకయితే చాలా భయం కలిగింది. జీవనోపాధి పోతుందేమోనని. . . ఇవిగో వీటిని దాటి ఎక్కడకీ పోలేదు. ఇంకా చాలాకాలం పోదుకూడా." అని పంచాగం కట్టలు కళ్ళకద్దుకున్నాడు.

ఆ పసిబిడ్డ మాత్రం ఏడుస్తూ ఉన్నాడు - తల్లిపాల కోసం అత్యంత సహజంగా ఉందా ఏడుపు.


మరా తల్లి పాలు ఇస్తుందో. . . ఇవ్వదో. . .

ఇవ్వనిస్తారో. . . లేదో. . .

సైన్స్ ముందుకు వెళ్తూనే ఉంది

మనుషులూ. . . . . ?! !

★





## రాజీవ్‌గాంధీపై సంచలనాత్మక తమిళసినిమా

'కెప్టెన్ ప్రభాకర్' సినిమా ద్వారా తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితుడైన సెల్వమణి రాజీవ్ గాంధీ దారుణ హత్యను ఇతివృత్తంగా తీసుకొని భారీఎత్తున నిర్మించిన 'కుట్ర పత్రికై' అనే తమిళ సినిమా సంచలనం సృష్టిస్తోంది. ప్రముఖ హిందీ కారెక్టర్ యాక్టర్ రాజీవ్ గాంధీగా నటిస్తున్న యీ చిత్రం రాజీవ్ గాంధీ హత్యను సెల్యూలాయిడ్‌పై పునర్నిర్మించి, తదనంతర CBI పరిశోధనలను, రాజకీయ పరిణామాలను చూపిస్తుంది. సెల్వమణికి ఇది ప్రతిష్ఠాత్మక చిత్రమనడంలో సందేహం లేదు.